క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు అందుకుంటున్న సాయిబాబా

పుల్లలచెరువు: మండలంలోని ఉమ్మడివరం సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సాయిబాబాకు ప్రత్యేకమైన రోజు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి శంకర్ ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా విరివిగా పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతికి 'అన్నా' నివాళి


ఖాశీంపీరా మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో మాజీ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకుడు డి.ఖాశీంపీరా అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పార్టీ నాయకులతో కలిసి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు ఉత్తమ్ కుమార్, విశ్రాంత వార్డెన్ నజీర్ అహ్మద్, ఖాశీం తదితరులు ఉన్నారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బేస్తవారిపేట: మండలంలోని 19 పంచాయతీల్లో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు సూచించారు. ఈనెల 25వ తేదీలోగా ఏపీఓబీఎంఎంఎస్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం తనిఖీ

కొమరోలు: కొమరోలులోని గ్రామ సచివాలయం-3 భవనంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీఓ మస్తాన్‌వలి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. శిక్షణకు గైర్హాజరు కాకుండా రోజూ రావాలని మహిళలకు సూచించారు. 75 శాతం పైగా హాజరు ఉన్న వారికి కుట్టు మిషన్ అందిస్తారని చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గత మూడు రోజుల వ్యవధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురిని గురువారం మార్కాపురం కోర్టులో హాజరుపరచగా జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ జరిమానా విధించారని పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. నలుగురు వ్యక్తులకు 10 వేల రూపాయలు, మరొకరికి 5 వేల రూపాయల చొప్పున జరిమానా విధించారని వివరించారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని ఎమ్మార్సీకి ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. కొమరోలుకు మొదటి విడతలో భాగంగా 17 వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ-2 బొర్రా వెంకటరత్నం తెలిపారు. పాఠ్యపుస్తకాలను తరగతుల వారీగా సీఆర్పీలతో విభజిస్తున్నట్లు చెప్పారు. రెండో విడత పాఠ్య పుస్తకాలు వచ్చిన తర్వాత పాఠశాలలకు అందజేస్తామని పేర్కొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాల పంపిణీ


ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలు పంపిణీ చేస్తున్న వైద్యులు

పొదిలి రూరల్: ఫ్లోరోసిస్ బాధితులకు పునరావాస పరికరాలు పంపిణీ చేసినట్లు జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ వేము అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు, ఆర్యన్ పీహెచ్‌సీ పరిధిలోని రాజుపాలెం గ్రామంలో ఫ్లోరోసిస్ బాధితులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024-25లో స్కూల్ సర్వే, కమ్యూనిటీ సర్వే నిర్వహించి, ఫ్లోరోసిస్ బాధితులైన వారికి 24 వీల్‌చైర్లు, 22 వాకర్స్, 21 వాకింగ్ స్టిక్స్, 18 వెస్టన్ కమోడిటీలు అందజేసినట్లు వివరించారు. ముఖ్యంగా ఫ్లోరోసిస్ బాధితులు పరిశుభ్రమైన తాగునీరు, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. అనంతరం ఫ్లోరోసిస్ బాధితులకు విటమిన్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పలపాడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుగుణకుమార్, శరత్ చంద్ర, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు ఆల్గొన్నారు.

పిడుగులతో తస్మాత్ జాగ్రత్త

- ప్రాణాలు తీస్తున్న పిడుగులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పెద్దారవీడు:

ఆకాశంలో మెరుపులు, ఉరుములతో భూమిపై, ఎత్తయిన వృక్షాలపై పడే పిడుగులతో మనుషులు, పశువులకు ప్రాణ నష్టం పొంచి ఉంది. వేసవిలో ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరడంతో పాటు వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన చిన్నపాటి వర్షాలు కురుస్తున్నాయి. అయితే పలుచోట్ల పిడుగులు పడుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మనుషులతో పాటు మూగజీవాలు, పశువులు పిడుగుపాటుకు గురై మత్యువాత పడుతున్నాయి. ఈ క్రమంలో పిడుగు మాట వింటేనే ప్రజలు అరచేతిలో ప్రాణం పెట్టుకొని భయాందోళన చెందుతున్నారు. పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకొనే రైతులు, బహిరంగ ప్రదేశాల్లో పశువులు, జీవాల కాపరులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. సమీప ప్రాంతాల్లో పిడుగులు పడుతుండటంతో గృహోపకరణాలు కాలిపోయి తీవ్ర నష్టాలు చవి చూస్తున్నారు. ఉరుములు, మెరుపుల సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పిడుగుపాటు నుంచి తప్పించుకోవచ్చని డాక్టర్లు పలు సూచనలు చేస్తున్నారు.


పిడుగుపాటుతో మృతి చెందిన వలపర్ల పెద్దగాలెయ్య (ఫైల్)

ముందస్తు జాగ్రత్తలు

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసేటప్పుడు చెట్ల కింద ఉండకూడదు. అ సమయంలో రైతులు పొలాల్లో ఉండకుండా ఇళ్లకు చేరుకోవాలి.
- వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలకు దూరంగా ఉండాలి.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే ఎట్టి పరిస్థితుల్లో పొలాల్లో రైతులు, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు ఉండరాదు.
- మెరుపులు కనిపించినప్పుడు అరచేతులతో చెవులు మూసుకొని, నేలపై మోకాళ్లపై కూర్చొని తల కిందకు వంచి ఉండాలి.
- ఆ సమయంలో విద్యుత్, ఎలక్ట్రానిక్ పరికరాలు వాడరాదు.
- కాంక్రీట్ నేలపై పడుకోవడం, గోడకు అనుకోవడం చేయరాదు.
- ఇనుము తలుపులు, పైపులు తాక కూడదు.
- మెరుపు కనిపించిన తర్వాత 30 సెకన్లలో లేదా అంతకన్న తక్కువ సమయంలో 10 కిలోమీటర్ల దూరంలోపు పిడుగు పడే అవకాశం ఉంది.
- మెరుపు కనపడిన తర్వాత 30 నిమిషాల పాటు బయటకు వెళ్లే ప్రయత్నం చేయవద్దు.
- గొడుగులపై లోహపు బోల్టులు, చేతిల్లో సెల్ ఫోన్లు లేకుండా చూసుకోవాలి. సెల్‌ఫోన్ ఉంటే అ సమయంలో స్విచ్ఛాఫ్ చేసుకోవాలి. ఒక వేళ అవి ఉంటే రేడియేషన్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది.
- వర్షం పడే సమయంలో విద్యుత్ తీగలు కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. అలాగే అటువంటి సమయంలో చెప్పులు లేకుండా బయటకు వెళ్లరాదు.
- గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారు మెరుపు, ఉరుములతో భయందోళనకు గురవుతారు. అటువంటి వారు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రథమ చికిత్స చేయాలి:



వర్షం వస్తుందనిపించే సమయంలో ప్రజలు బయటకు వెళ్లకుండా ఉండాలి. అప్రమత్తంగా ఉంటే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు. పిడుగుపాటుకు గురైన వ్యక్తిని వెంటనే పొడి ప్రదేశంలో తిన్నగా పడుకోబెట్టాలి. తడి బట్టలు వెంటనే తీసి వేయాలి. తలను ఒక పక్కకు తిప్పాలి. రెండు కాళ్లను ఒక అడుగుపైకి ఎత్తాలి. గాలి తగిలే ప్రదేశంలో ఉంచి అవసరమైతే నోటి ద్వారా గాలి ఊది ప్రథమ చికిత్స చేయాలి. సకాలంలో దగ్గరలో ఉన్న అస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించాలి.

డాక్టర్ జగదీష్, ఎంపీహెచ్‌సీ, పెద్దారవీడు


పేరయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ

ముండ్లమూరు (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కిలారి పేరయ్య ఇటీవల మోకాలి ఆపరేషన్ చేయించుకున్న సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం పరామర్శించారు. పేరయ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. జాగ్రత్తగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్!


మండల కేంద్రానికి చేరిన పాఠ్యపుస్తకాలు

పుల్లలచెరువు: కొత్త పాఠ్యపుస్తకాలు మండల కేంద్రానికి చేరుకున్నాయి. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే వాటిని సిద్ధం చేయాలని జిల్లా అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో వచ్చిన పుస్తకాలను మండల కేంద్రంలోని ఎంపిక చేసిన స్టాక్ పాయింట్‌లో నిల్వ చేసినట్లు ఎంఈవో ఇందిర తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పేరుతో వాటిని పంపిణీ చేయనున్నామని, బడి తెరిచిన రోజే వచ్చిన విద్యార్థులకు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు నోట్‌పుస్తకాలు, బెల్ట్‌లు, టెక్స్ పుస్తకాలు మాత్రమే వచ్చాయని, త్వరలో రానున్న మిగిలిన పుస్తకాలు, ఇతర వస్తువులను కిట్లుగా తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో తెలిపారు. ఇప్పటి వరకు 17,050 పుస్తకాలు వచ్చాయని, మిగిలినవి త్వరలో వస్తాయని తెలిపారు.

పాలిసెట్ ఫలితాల్లో దోర్నాల విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో డైరెక్టర్

పెద్దదోర్నాల: ఏపీ పాలిసెట్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ఇన్‌స్పైర్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చూపడంపై ఉపాధ్యాయులు అభినందనలతో ముంచెత్తారు. మండల కేంద్రానికి చెందిన షేక్ బషీర్ 115 మార్కులతో 436వ ర్యాంక్, షేక్ మాజ్ 113 మార్కులతో 887వ ర్యాంక్ సాధించడంపై కోచింగ్ సెంటర్ డైరెక్టర్ డి.సుధాకర్ అభినందించారు. కోచింగ్ సెంటర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందనలతో ముంచెత్తారు. ఉపాధ్యాయులు సతీష్, శ్రీనివాసరావు, సురేఖ పాల్గొన్నారు.

నేటి నుంచి నాటక పోటీలు

దర్శి (కురిచేడు): స్థానిక వజ్జా నారాయణమ్మ కళా ప్రాంగణంలో దర్శనాపురి నాటక కళాపరిషత్ 12వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటక పోటీలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు కలవకొలను అనంత్, కూనం జైహింద్‌రెడ్డిలు సంయుక్తంగా తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభ సభ ఉంటుందన్నారు. పోటీలు ఈ నెల 18 వరకు జరుగుతాయని, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాత్రి 7 గంటలకు చైతన్య కళాభారతి, కరీంనగర్ వారిచే ఖరీదైన జైళ్లు నాటిక ప్రదర్శన, రాత్రి 8 గంటలకు అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారితో చిగురు మేఘం నాటిక ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సాయంత్రం 6 గంటలకు దాసరి చంద్రశేఖర్ కళాప్రాంగణంలో సభ జరుగుతుందని, అనంతరం 7 గంటలకు సాయి ఆర్ట్స్ కొలకలూరు వారితో జనరల్ భోగీలు నాటిక, 8 గంటలకు చిలకలూరిపేటకు చెందిన మద్దుకూరి ఆర్ట్స్ వారిచే మా ఇంట్లో మహాభారతం హాస్యనాటిక, 9 గంటలకు హైదరాబాద్‌కు చెందిన యువభేరి థియేటర్ ఆర్ట్స్ వారిచే నా శత్రువు నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు చందు వెంకటయ్య కళాప్రాంగణంలో సభ జరుగుతుందని, అనంతరం రాత్రి 7 గంటలకు విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే స్వేచ్ఛ నాటిక ప్రదర్శన, 8 గంటలకు కూచిపూడి గురుకులం, శ్రీకాకుళం వారిచే ద్రౌపది కూచిపూడి నృత్యరూపకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9.30 గంటలకు విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ప్రదర్శనకు వచ్చిన మహిళా ప్రేక్షకులకు ప్రతి నాటికకు లక్కీ డిప్ ద్వారా నేటి మహిళను ఎంపిక చేసి బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని దర్శి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోవాలి

ముండ్లమూరు (కురిచేడు): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, రైతు భరోసా పథకాలకు రైతులు ఈ నెల 20వ తేదీలోపు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ కోరారు. 2025 సంవత్సరంలో అన్నదాత సుఖీభవ పథకం కోసం 21,789 మంది రైతు ఖాతాలు ఉండగా వారిలో కేవలం 8,889 మంది రైతుల ఖాతాలు మాత్రమే తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన రైతులందరూ తమ ఆధార్‌కార్డు, పొలం పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకుని మీ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను కలిసి వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ లింకును సరి చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి జె.రాజరాజేశ్వరి, ఏఈఓ వేమూరు శ్రీకీర్తి, వ్యవసాయ సహాయకులు ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

జీఓ 117ని వెంటనే రద్దు చేయాలి


ప్రభుత్వ విద్యా విధానంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

దర్శి (కురిచేడు): విద్యారంగంలో సంస్కరణల పేరుతో తెచ్చిన 117 జీఓను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జీఓ 21ని ఖండిస్తున్నామని, తెలుగు, సమాంతర మీడియం లేకుండా చేయడంపై ఆయన మండిపడ్డారు. సాల్ట్ పథకం రద్దు చేయకుండా నిర్బంధంగా ప్రపంచ బ్యాంకు విధానాలు అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. 10వ తరగతి పరీక్షల్లో 68 వేల మందికిపైగా విద్యార్థులు తెలుగులోనే రాశారని గుర్తు చేశారు. 45 మంది దాటితే హైస్కూళ్లలో సెక్షన్ చేయాలని కోరారు. ప్రభుత్వ విధానాలతో ఫౌండేషన్ పాఠశాలలు బతికే అవకాశం లేదని పేర్కొన్నారు. ఫౌండేషన్ పాఠశాలల్లో విద్యార్థులతో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, ఎడ్యుకేషన్ లీవ్‌లో ఉన్న వారి పోస్టులు ఖాళీగా చూపరాదని, చర్చలు జరిపినా ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు మూడు రోజులు చూసి ఇతర సంఘాలు, పిల్లల తల్లిదండ్రులతో కలిసి ఉద్యమానికి పిలుపునిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మీనిగ శ్రీను, దర్శి మండల అధ్యక్షుడు కమ్మా శ్రీనివాసరావు, దొనకొండ మండల అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, పి.దేవదాసు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

కంభం: బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. గురువారం కంభం సచివాలయాన్ని, బస్టాండ్ సమీపంలో 6వ నంబరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కంభం పంచాయతీ కార్యాలయంలో జనన ధ్రువీకరణ పత్రాల రిజిస్టర్లను పరిశీలించారు. జీఓఎంఎస్ నం.31, 39ను అనుసరించి బాల్య వివాహాలకు సంబంధించిన రికార్డులు, జీఓఎంఎస్ నం.1ను అనుసరించి బాలల పరిరక్షణకు సంబంధించిన కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రతి సచివాలయంలో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు ప్రదర్శించాలని సూచించారు. గ్రామ కమిటీల వివరాలు, కిశోర వికాసానికి సంబంధించిన కౌమార బాలికల గ్రూపుల వివరాలు పరిశీలించారు. సచివాలయాల్లో సమావేశాలు సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆమెను కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.కిరణ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, కార్మిక శాఖ సహాయశాఖాధికారి బాలకాశి, డీసీటీఓ దినేష్, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, సీడీపీఓ నీలోఫర్, కార్యదర్శి మోహన్ రెడ్డి, సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.


కంభంలో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

గిద్దలూరు రూరల్: అంగన్‌వాడీ సెంటర్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆదేశించారు. పట్టణంలోని బాలసదన్, సీడీపీఓ కార్యాలయం, గణేష్ నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఆమె గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని కార్యకర్తలకు సూచించారు. బాల కార్మికులను గుర్తించి బాలల సదన్‌కు తరలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ ఐ.శ్రీనివాసులు, ఇన్‌చార్జి తహశీల్దార్ నాయబ్‌హుస్సేన్, సీడీపీఓ బి.జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.


బేస్తవారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు పరిశీలిస్తున్న బత్తుల పద్మావతి

బేస్తవారిపేట: బాలల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలని బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. గురువారం స్థానిక సచివాలయం-1, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. బాల్య వివాహాలు, బాలల పరిరక్షణ కమిటీ రికార్డులు సచివాలయాల్లో ఉంచాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్ర కుమార్, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, సీడీపీఓ నీలోఫర్ బేగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని కుటుంబానికి యూటీఎఫ్ చేయూత


కుటుంబ సంక్షేమ విరాళాన్ని అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గిద్దలూరు రూరల్: మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పాలుగుళ్ల కిరణ్‌కుమార్ రెడ్డి వెంకటాపురం గ్రామంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వరిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి చేయూతగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ గిద్దలూరు మండల అధ్యక్షుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించడమే కాకుండా ఆపద సమయంలో ఆదుకునేందుకు యూటీఎఫ్ ముందుంటుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే కుటుంబ సంక్షేమ పథక సంఘీభావ విరాళం కింద ఉపాధ్యాయుడి కుటుంబానికి చేయూతనిచ్చామన్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక ప్రయోజనాలు త్వరగా అందించేందుకు యూనియన్ సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు రమణారెడ్డి, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, రాచర్ల మండలం ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

హైవే రోడ్డుపై తవ్వారు.. వదిలేశారు!


ప్రమాదకరంగా మారిన హైవే రోడ్డు అంచు

కంభం: స్థానిక కందులాపురం సెంటర్‌లో హైవే రోడ్డుపై ఓ వైపు గుంతలు తీసి గత మూడు నెలలుగా అలాగే వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కేబుల్స్ లాగేందుకు మూడు నెలల క్రితం నిత్యం రద్దీగా ఉండే కందులాపురం కూడలిలో హైవే రోడ్డుకు ఓ వైపు గుంతలు తీశారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ మార్గంలో పలుమార్లు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు.

అధికారులు స్పందించి గుంతలను పూడ్చించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన శిక్ష

బేస్తవారిపేట: నాటుసారా తయారు చేస్తే ఎనిమిదేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా ఎదుర్కోవాల్సి వస్తుందని మార్కాపురం అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.బాలయ్య హెచ్చరించారు. గురువారం మండలంలోని చెన్నుపల్లె, కోనపల్లెలో నాటుసారాతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. నాటుసారా తాగితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. రీహాబిలిటేషన్, జీవనోపాధి కోసం ఎటువంటి సహాయం కావాలో పాత నేరస్తులను అడిగి తెలుసుకున్నారు. నాటుసారా నిర్మూలనపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంభం ఎక్సైజ్ సీఐ ఎస్.కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్ శాఖ అధికారులు